క్లుప్తంగా

క్రీడల విజేతలకు అభినందన


విజేతలతో ప్రజాప్రతినిధులు, అధికారులు

పెద్దపంజాణి: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి రాణించాలని ఎంపీపీ రెడ్డెప్ప ఆకాంక్షించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ రహీం అధ్యక్షతన అభినందన సభ ఏర్పాటు చేశారు. విజేతలకు క్రీడా కిట్లు పంపిణీ చేసి ఎంపీపీ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు ఉద్దేశించిన ఆడుదాం ఆంధ్రా విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, ఈఓపీఆర్‌ఆర్డీ శారదాదేవి, ఏఓ భాస్కర్, సర్పంచులు రమేష్‌బాబు, స్వర్ణలత, పార్టీ నాయకులు అమరనాథరెడ్డి, కుమార్‌రెడ్డి, లతీఫ్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా కిట్ల పంపిణీ


క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న ఎంపీపీ

రొంపిచెర్ల: పుంగనూరులో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనే మండల క్రీడాకారులకు క్రీడాకిట్లను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. 10 జట్ల క్రీడాకారులకు వీటిని అందజేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు దేవులపల్లె హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఎంపీడీఓ రాజేంద్ర, డాక్టర్ శ్రీనాథ్, సర్పంచ్ నాగిరెడ్డి, అన్సర్‌బాషా, నాయకులు కమలాకర్ రెడ్డి, కరీముల్లా, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐగా సుజనాబాబు



కుప్పం: కుప్పం ఎస్ఈబీ సీఐగా సుజనాబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కిషోర్ కుమార్ అనంతపురం జిల్లా ఉరవకొండకు బదిలీపై వెళ్లారు. కర్నూలు జిల్లా కోసిగి స్టేషన్ నుంచి బదిలీపై సుజనాబాబు ఇక్కడికొచ్చారు.

డీసీసీబీ బ్యాంకు నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

పలమనేరు: పట్టణంలోని మదనపల్లె రోడ్డులో డీసీసీబీ బ్యాంకు నిర్మిస్తున్న పనులను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం పరిశీలించారు. పనులు వేగవంతంగా సాగుతున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



సురేష్‌బాబు, భారతి

శాంతిపురం: పీఆర్‌టీయూ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు యూనియన్ రాష్ట్ర కౌన్సిలర్ శంకర్ తెలిపారు. సోమవారం శాంతిపురంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా ఎం.సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా అజిత్ కుమార్, మహిళా అధ్యక్షురాలిగా బి.భారతి, గౌరవాధ్యక్షుడిగా టి.గిరిబాబు, 16 మందితో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు.

అయోధ్య రాముడికో మర్రి మొక్క

పలమనేరు: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా స్థానిక పలమనేరు ప్రకృతి ప్రేమికుడు మల్లిచెట్ల దేవేంద్ర రాముడికో మర్రిమొక్క పేరిట స్థానిక చెరువు సమీపంలో మర్రిమొక్కను నాటాడు. ప్రజలు సైతం దేవుడి పేరిట మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.

మహిళల అభ్యున్నతికే 'ఆసరా'


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ

గుడుపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతి కోసం ప్రవేశ పెట్టిన ఆసరాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వరలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని కనమనపల్లె, దిన్నేపల్లెలో మహిళలకు సమావేశం నిర్వహించారు. 32 గ్రూపులకు సంబంధించి 3600 మంది సభ్యులకు రూ1.40,00,000 జగనన్న ఆసరా కింద మంజూరు కానున్నట్టు చెప్పారు. ఈ ఆసరాతో ఆర్థికంగా ముందుకుపోవాలని, అప్పుడే ఆ కుటుంబంలో పిల్లలకు కూడా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, నారాయణస్వామి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

జై శ్రీరామ్

- పట్టణంలో కాషాయపతాకాల రెపరెపలు
- సీతారామాంజనేయుని ఆలయంలో శ్రీరామ యజ్ఞం
- శ్రీరామ ధ్వజంతో మోటార్ సైకిళ్ల ర్యాలీ
- పలు దేవాలయాల్లో పూజలు, అక్షింతలు పంపిణీ


వి.కోట: సీతారామలక్ష్మణ వేషధారణతో చిన్నారులు


వి.కోట: సీతారామ ఉత్సవమూర్తులతో భారీ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు, (ఇన్ సెట్‌లో) పలమనేరు: సీతారామాంజనేయస్వామి ఆలయంలో చేస్తున్న శ్రీరామ సహస్రనామ యజ్ఞం, కుప్పం: రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కళ్యాణోత్సవం

పలమనేరు: అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పలమనేరు పట్టణం సోమవారం రామయమైంది. పట్టణంలోని వీధులన్నీ కాషాయ పతాకాలు, ఇళ్లపై శ్రీరామాంజనేయుని జెండాలు రెపరెపలాడాయి. రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. హిందూ ధర్మమండలి సభ్యులు పట్టణంలో భారీగా మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించి జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. బజారు వీధిలోని సీతారామాంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ సహస్రనామ యజ్ఞం చేశారు. గంటావూరుకు చెందిన తేజ్‌కిరణ్ అనే బాలుడు బాలరాముని వేషంలో పలు ఆలయాల్లో జరిగిన పూజల్లో పాల్గొని భక్తులను అలరించాడు. మరోవైపు వీహెచ్‌పీ నాయకులు పురవీధుల్లో భజనలు, మంగళవాయిద్యాల నడుమ, మేళతాళాలతో రామనామ స్మరణ చేస్తూ శ్రీరాముని చిత్రపటాన్ని ఊరేగించారు. స్థానిక చింతకాయల మండీ వ్యాపారులు సైతం పలు కార్యక్రమాలను నిర్వహించారు. వాసవివనిత క్లబ్ సభ్యురాళ్లు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పట్టణంలోని పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు. పలు హిందూ ధార్మిక సంస్థల నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండల వ్యాప్తంగా వివిధ ఆలయాలలో సోమవారం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి మూల విరాట్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే పలు గ్రామాలలో సీతారామలక్ష్మణ ఉత్సవమూర్తులను ఊరేగించి అన్నదానం చేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయం, శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం, కార్వేటికొండపై ఉన్న శ్రీ ధ్యానాభిరామస్వామి ఆలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారామలక్ష్మణ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. బైరెడ్డిపల్లె శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం నుంచిసీతారామలక్ష్మణ చిత్రపటాలతో పురవీధుల్లో శ్రీరామభక్తులు ర్యాలీ నిర్వహించారు.

వి.కోటలో..

వి.కోట: పట్టణంలో శ్రీరామ భక్తులు శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను ఘనంగా ఊరేగించారు. స్థానిక పత్రపల్లె నుంచి వైఎస్సార్ సర్కిల్, ఎంజీ రోడ్డు, కేజీఎఫ్ బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా దుర్గామాత ఆలయం వరకు వేలాదిమంది భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తుల కోలాటాలు, డీజే కార్యక్రమాలతో ఊరేగింపు సాగింది. చిన్నపిల్లలు సీతారామలక్ష్మణుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పట్టణంలో పలుచోట్ల అన్నదానం చేశారు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో సీతారాముల చిత్రపటాలతో ఇదే కార్యక్రమం నిర్వహించారు.

పుంగనూరు నియోజకవర్గం

పుంగనూరు: పట్టణంలో వేలాది మంది జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు.హిందూ జాగరణ సమితి, ఆర్య వైశ్య సంఘం, ఆర్ఎస్ఎస్ తదితర హిందూ సంస్థల సభ్యులు కలసి స్థానిక వాసవిదేవి ఆలయం నుంచి వేలాదిమందితో ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీలో సీతారామ లక్ష్మణ భరత ఆంజనేయస్వామి వేషధారణలో చిన్నారులు ప్రత్యేకాకర్షణగా నిలిచారు. అలాగే మహిళలు శ్రీరాముని అయోధ్య అక్షింతలతో శ్రీరామ నామస్మరణ చేశారు. ఇక, మండలంలో శ్రీరామాలయాలు ఉన్న గ్రామాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రామ సంకీర్తనలు ఆలపించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని ఆలయాలన్నీ రామనామస్మరణంతో మార్మోగాయి. బస్టాండులో కమలాంజనేయస్వామి ఆలయం నుంచి హనుమాన్, సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆంజనేయ, రామాలయాల్లో పూజలు చేశారు. అన్న ప్రసాద వితరణ చేశారు. బైక్ ర్యాలీ చేశారు.

వెంకటరెడ్డిపల్లెలో..

సదుం: మండలంలోని వెంకటరెడ్డిపల్లె రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలో చల్లావారిపల్లెలోని రామాలయంలో పూజలు చేశారు. అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను భక్తులకు పంచారు. అనంతరం అన్నదానం చేశారు. ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, నాదమునిరెడ్డి, శివ, సదాశివరెడ్డి, వంశీ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం

కుప్పం: కుప్పం ప్రాంతంలోని పలు దేవాలయాలు రామ నామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని రామలింగేశ్వ దేవాలయం, సీతారామాంజనేయ దేవాలయం, కోదండ రామాలయంలో విశేష పూజలు చేశారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, ప్రత్యేకంగా పుష్పాలంకరణ, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను భక్తులకు పంపిణీ చేసి ఆలయ అర్చకులు ఆశీర్వదించారు.


రాయలపేట కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు

సాయంత్రం రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు దంపతులుగా తరలి వచ్చి పాల్గొన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పంలో సీతారామ పట్టాభిషేకం చిత్రపటాన్ని అలంకరించి, వీధుల్లో ఊరేగించారు. అన్నదానం చేశారు. జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

గుడుపల్లె మండలంలో..

గుడుపల్లె: మండల వ్యాప్తంగా పలు గ్రామాలలోని ఆలయాలు రామ నామస్మరణతో మార్మోగాయి. అనగర్లపల్లె, గుత్తర్లపల్లె, కప్పలనత్తం, గుడివంక వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, గుడుపల్లె రైల్వేస్టేషన్ క్రాస్, కాడేపల్లె గ్రామాలతో పాటు పలు గ్రామాలలో పండుగ వాతావరణంతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు భజన చేశారు.


చౌడేపల్లె: గడ్డంవారిపల్లెలో రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు


బైరెడ్డిపల్లె: శ్రీధ్యానాభిరామస్వామి ఆలయంలో..


గుడుపల్లె: కాడేపల్లెలో భజన చేస్తున్న భక్తులు



పట్టణంలో శ్రీరాముని చిత్రపటంతో ఊరేగింపు, పలమనేరులో అన


బైరెడ్డిపల్లె: సీతారామలక్ష్మణ చిత్రపటాలతో ఊరేగిస్తున్న శ్రీరామభక్తులు


పులిచెర్ల: చల్లావారిపల్లెలోని రామాలయంలో ప్రత్యేక పూజలు

నియోజకవర్గ ఓటర్లు 2.36 లక్షలు

- ఎన్నికల అధికారి ప్రభాకర్‌రెడ్డి వెల్లడి

పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గం ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి ప్రభాకర్‌రెడ్డి సోమవారం విడుదల చేశారు. ఏఈఆర్‌వోలు నరసింహ ప్రసాద్, సీతారామన్, శేషగిరిరావుతో కలసి ఈ జాబితాను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో మార్పులు-చేర్పులు, తీసివేతల అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుదిజాబితాను ప్రకటించామన్నారు. నియోజకవర్గంలో 2,36,009 లక్షల ఓటర్లు ఉన్నారని, వీరిలో మహిళలు 1,19,217 మంది, పురుషులు 1,16,773 మంది ఉన్నట్లు తెలిపారు. గత ఎన్నికలలో మొత్తం ఓటర్లు 2,18,268 మంది ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. డీటీ హరికృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితా విడుదల

- తొలగించిన ఓటర్లు 8,778
- కొత్త ఓటర్లు 14,111
- మొత్తం ఓటర్లు 2,23,104

కుప్పం: కుప్పం నియోజకవర్గానికి సంబంధించి తుది ఓటర్ల జాబితాను విడుదల చేసినట్లు కుప్పం ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలో 2014-19 ఎన్నికల సమయంలో 2,13,146 మంది ఓటర్లు ఉండగా 2019-24 ఎన్నికలకు 9,968 ఓటర్లు పెరిగి 2,23,104 చేరిందన్నారు. ఈ ఐదేళ్లలో 8,778 ఓటర్లను తొలగించగా, 14,111 మంది కొత్తగా ఓటు హక్కు కల్పించినట్లు చెప్పారు. మండలాల వారీగా చూస్తే..కుప్పం రూరల్: 56,855, కుప్పం అర్బన్:38611, శాంతిపురం: 47,254, రామకుప్పం: 45,283, గుడుపల్లె: 35,101మంది చొప్పున ఉన్నట్టు వివరించారు.

పలమనేరులో 2,66,935 మంది ఓటర్లు: ఆర్డీఓ

పలమనేరు: 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తుది జాబితాలను సోమవారం తన కార్యాలయంలో ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నిక షెడ్యూల్ విడుదలైతే నామినేషన్లకు పదిరోజుల ముందు వరకూ కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. ఇప్పటి వరకూ ఓటర్ల జాబితా చాలా పారదర్శకంగా ఉందని, పలమనేరు నియోజకవర్గంలో ఓటర్ల నమోదుతో మొత్తం ఓటర్ల సంఖ్య 2,66,935కు చేరిందన్నారు.సర్వీసు ఓటర్లు, పీడబ్ల్యూడీ ఎలక్ట్రోల్స్, వయసువారీగా ఓటర్ల వివరాలు, కొత్తగా చేరిన ఓటర్లు, తొలగింపుల వివరాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ కుప్పుస్వామి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక


స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

పెద్దపంజాణి: జాతీయ స్థాయి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పోటీ పరీక్షలో పెద్దపంజాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 8వ తరగతి విద్యార్థులు హాసిని, హఫ్సా, ఫిర్దోస్, సోము, సంధ్యారాణి, వినయ్ ప్రతిభ కనబరచి స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని హెచ్‌ఎం కేశవప్పిళ్లై సోమవారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

కుష్ఠుపై అప్రమత్తంగా ఉండాలి

- ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ సాగర్


రొంపిచెర్ల: వైద్యులతో మాట్లాడుతున్న జేడీ

రొంపిచెర్ల: కుష్ఠు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సాగర్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. కుష్ఠు అంటు వ్యాధి కాదన్నారు. అయితే ఈ వ్యాధి బయట పడడానికి 20 ఏళ్ల వరకు పడుతుందన్నారు. ఇది ఎక్కువగా నాడీ వ్యవస్థ, చర్మం, కళ్లు, ఎముకలు, కీళ్ల వంటి వాటిపై వస్తుందని వ్యాధి లక్షణాలను వివరించారు. ప్రాథమిక దశలో వ్యాధి లక్షణాలను గుర్తిస్తే చికిత్సతో దీనిని నుంచి విముక్తి పొందవచ్చన్నారు. ఎవరైనా కుష్ఠు లక్షణాలతో బాధపడుతున్న పక్షంలో స్థానిక పీహెచ్‌సీలో నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. మండలంలో ఈ నెల 12 వరకు చేసిన పరీక్షలలో 78 మందిని అనుమానితులుగా గుర్తించారని, వీరికి వైద్యసేవలు అందిమన్నారు. కార్యక్రమంలో డీఎల్ఓ డాక్టర్ వెంకట ప్రసాద్, డీపీఎంఐ రవికుమార్, డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, సీహెచ్ఓ కాంతమ్మ, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య కార్యకర్త వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..


చౌడేపల్లె: క్షయ, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వాసుపత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలతోపాటు ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చునని జిల్లా క్షయ, లెప్రసీ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. మండలంలో 21 క్షయ కేసులు, 4 కుష్ఠు వ్యాధి కేసులు న్నాయని, వీరికి ఉచితంగా వైద్యసేవలందించడంతోపాటు నెలకు రూ:500 చొప్పున పౌష్టికాహారం కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తోందన్నారు. రోగులతో మాట్లాడి ప్రభుత్వ సేవ లు, సదుపాయాలపై ఆరా తీశారు. త్వరలో పెద్దలకు అడల్స్ బీసీజీ వ్యాక్సిన్ అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. క్షయ బాధితులకు వైద్య సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు ప్రోత్సాహ బహుమతులు సైతం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్‌కుమార్, పూజ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న స్థానిక నాయకులు

కుప్పం రూరల్: వివిధ కారణాలతో మృతి చెందిన ఇద్దరు మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ భరత్ తల్లి పద్మమ్మ చెరో పది వేల రూపాయల ఆర్థికసాయం చేశారు. వివరాలు..కుప్పం మండలం, ఊరు నాయుని కొత్తూరుకు చెందిన నరసింహులు (20) కుటుంబ కలహాలతో ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే, గుడ్లనాయన పల్లెకు మురుగేష్ (65) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మరణించాడు. వీరిద్దరి దహనక్రియల కోసం ఎమ్మెల్సీ తల్లి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆర్థిక సాయం చేశారు. ఇద్దరి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గిరిప్రసాద్, గణపతి, గోవిందరాజులు, నరసింహులు,శేఖర్, శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు


ట్యాబ్‌లు పొందిన వారితో కౌన్సిలర్, చలపతి

పుంగనూరు: ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని కౌన్సిలర్ కిజర్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉర్దూ హైస్కూల్లో 82 మంది విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను హెచ్‌ఎం చలపతితో కలసి ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు ఢీ కొని వృద్ధురాలి మృతి


పట్టాలపై మృతి చెంది ఉన్న గుర్తు తెలియని మహిళ

కుప్పం రూరల్: రైలు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలో గుడుపల్లె వైపు రైల్వే పట్టాలు దాటుతూ ఓ గుర్తు తెలియని వృద్ధురాలు వెళుతుండగా రైలు ఢీకొని మరణించినట్లు స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం చేరవేశారు. రైల్వే పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. వృద్ధురాలికి సుమారు 60 ఏళ్ల ఉండవచ్చని, పింక్ కలర్ చీర, వంకాయ పువ్వు కలర్ లంగా ధరించి ఉన్నట్లు రైల్వే హెచ్‌సీ నాగరాజు తెలిపారు. ఎవరైనా ఆనవాళ్లు గుర్తిస్తే కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

జగనన్నతోనే బడుగులకు గుర్తింపు


కాకర్లవంకలో చీరలు అందజేస్తున్న దుర్గ

శాంతిపురం: బీసీ, ఎస్సీ, ఇతర పేదలు, బడుగులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే గుర్తింపు లభించిందని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ స్పష్టం చేశారు. సోమవారం ఆమె అబకలదొడ్డి పంచాయతీలో పర్యటించారు. మహిళలతో మాట్లాడి వారికి చీర, పసుపు కుంకుమలను పంపిణీ చేసి మాట్లాడారు. బీసీ జనాభా అత్యధికంగా ఉన్న కుప్పం నియోజకవర్గం నుంచి 2014, 2019, 2024లో బీసీ కులానికి చెందిన అభ్యర్థి పోటీ చేసే అవకాశం కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. అంతేకాకుండా అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చింది కూడా జగనన్నే అని, నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి పేద పిల్లలకు నాణ్యమైన భోజనం, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన అందిస్తున్నారన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమ్మ, నాయకులు ఆర్ముగం, మురుగేష్, చిన్నప్ప, చలపతి, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం పరిష్కారం

- పశువుల సంత ఏర్పాటుకు మార్గం సుగమం


జేసీబీతో తొలగిస్తున్న అక్రమ కట్టడాలు

శాంతిపురం: మండలంలోని మొరసనపల్లె పంచాయతీలో కొంత కాలంగా సాగుతున్న భూ వివాదానికి తెర పడింది. గొర్రెల సంత ఏర్పాటుకు పంచాయతీ ప్రతిపాదించిన అసైన్డ్ భూమిలో కొందరు నిర్మాణానికి పూనుకోవడంతో స్థానికులు పనులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలతో స్థానిక పెద్దలు చర్చించి వివాదాస్పద స్థలాన్ని పంచాయతీకే అప్పగించేలా తీర్మానించారు. దీంతో సోమవారం జేసీబీతో నిర్మాణాలను తొలగించారు. పశువుల సంత ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు.ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, స్థానిక సర్పంచ్ జగదీష్, ఎంపీటీసీ మురుగేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ పార్టీ అధిష్టానం, ఎమ్మెల్సీ భరత్ ఆదేశాల మేరకు సమస్యను సామరస్యంగా పరిష్కరించినట్టు చెప్పారు.

ఆత్మీయ సన్మానం


పవిత్రను సన్మానిస్తున్న వార్డు ప్రజలు

పలమనేరు: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నియమితులై ప్రమాణస్వీకారం చేసి వచ్చిన పవిత్రకు స్థానిక 20,21 వార్డుల ప్రజలు సోమవారం ఆమెకు ఆత్మీయ సన్మానం చేశారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్డీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వన్నె తెచ్చింది జగనన్నే


మాట్లాడుతున్న వన్నియ కులపెద్దలు

గుడుపల్లె: కుప్పం నియోజకవర్గంలో వన్నియ కులానికి వన్నె తెచ్చి పెట్టింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వన్నియకుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్, కుల పెద్దలు స్పష్టం చేశారు. సోమవారం నూతనంగా నిర్మించిన వన్నికుల కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 35 ఏళ్ల ఎమ్మెల్యేగా, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు నియోజకవర్గంలో ఉన్న 45 శాతం వన్నియ కుల సామాజిక వర్గ అభ్యున్నతిని విస్మరించారని ఆరోపించారు. కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా దివంగత చంద్రమౌళి పోటీ చేస్తే అప్పుడు మాత్రం వన్నియ కులస్తులు గుర్తుకు వచ్చారని, ఎన్నికల సమయంలో హడావుడిగా వన్నియ కులం కమ్యూనిటీ హాల్ కట్టిస్తామని చెప్పి, గోడలు కట్టి అనంతరం వదిలేశారని విమర్శించారు. ఎమ్మెల్సీ భరత్ జోక్యంతో కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి అయ్యిందన్నారు. టీడీపీ నాయకులు ఓట్ల కోసం వన్నియ కుల సామాజిక వర్గాన్ని వాడుకుంటున్నారన్నారు.

కమ్యూనిటీ భవనం ప్రారంభం రేపు

నూతనంగా వన్నియ కుల కమ్యూనిటీ భవనాన్ని ఈ నెల 24న ప్రారంభించనున్నట్లు ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్ తెలిపారు. పార్టీలకతీతంగా వచ్చి పాల్గొనాలని కోరారు. భవనం ప్రారంభోత్సవ శిలాఫలకంలో ప్రొటోకాల్ ప్రకారం అందరి పేర్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో కుప్పం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మురుగేష్, జెడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్ శరవణ, సింగిల్ విండో మాజీ చైర్మన్ పత్రాలు మునిరత్నం, శాంతిపురం మండల కన్వీనర్ దండపాణి పాల్గొన్నారు.